క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



భీమాస్ సర్కిల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిటౌన్: ఎండాకాలంలో పేదల దాహార్తి తీర్చేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం డా.జ్యోతిర్మయి విద్యాసంస్థలు, బాలాజీ జూనియర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో భీమాస్ సర్కిల్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా కమిషనర్ ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ.. వివిధ పనులపై రోజుకు వేల సంఖ్యలో ప్రజలు ఆదోని పట్టణానికి వచ్చి వెళ్తుంటారని, వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. నీటిని పొదుపుగా వాడుకుందామని, వృథా చేయవద్దని పిలుపునిచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఎంవీఐ శిశిర దీప్తిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, పట్టణ వైద్యులు శాంతిజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. వారు మాట్లాడుతూ.. యుక్త వయస్సు బాలికలు ప్రేమ, సెల్‌ఫోన్ వంటి వ్యాపకాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని బాగ చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులను సన్మానించారు. కళాశాల చైర్మెన్ విట్టా సతీష్, కరెస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, కళాశాల మహిళ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏసీయూసీఏ అధ్యక్షులు రెవ. జి.ఆనంద్‌రాజ్

ఆదోని సెంట్రల్: క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని ఆదోని క్రిష్టియన్స్ యునైటెడ్ చర్చ్ ఏస్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవ జి.ఆనంద్‌రాజ్ తెలిపారు. గురువారం రాజశ్రీ హోటల్ సమావేశ మందిరంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ క్రైస్తవులకు కమ్యూనిటీహాల్ లేకపోవడంతో పెళ్లిళ్లు, ఎదైనా ఫంక్షన్ చేయాలన్న ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహారీ నిర్మించాలని డిమాండ్ చేశారు. చర్చిల నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేయాలన్నారు. పాస్టర్లకు ఇంటి స్థలాలతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వారికే రానున్న ఎన్నికల్లో మద్దతుగా ఉంటామన్నారు. ఏసీయూసీఏ జనరల్ సెక్రటరీ బి.ఎజ్రా శ్రీధర్, ట్రెజరర్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగ స్వామి

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న కౌతాళం జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. కొంత మంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

నేడు మాంసం దుకాణాల బంద్

కౌతాళం: మహాశివరాత్రి పండుగ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మాంసం విక్రయాలు చేపట్టరాదని కౌతాళం పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, సర్పంచ్ పాల్‌దినకర్ సూచించారు. గురువారం వారు మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా మాంసం దుకాణాలతో పాటు పెద్దకమేళాలో జంతువులను వధించకూడదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలకు ఆర్థిక చేయూత

- నాల్గవ విడత చేయూత నిధుల విడుదలతో ఆనందం
- నాలుగేళ్లలో మంత్రాలయం నియోజకవర్గంలో రూ.105.12 కోట్లు, ఆదోని నియోజకవర్గంలో రూ.116.30 కోట్లు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



పిండి మరతో ఆలిమా బీ



కిరాణా దుకాణం నిర్వహిస్తున్న హనుమంతమ్మ

కోసిగి: మహిళ అభివృద్ధి చెందితే ఆ కుటుంబం బాగుపడుతుందని, కుటుంబాలు బాగుంటే గ్రామాలు బాగుంటాయని భావించి ప్రభుత్వ మహిళాఅభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. మహిళల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తూ, ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి అభ్యున్నతికి తోడ్పాటుకు అందిస్తోంది. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయసున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకం ద్వారా ప్రతి మహిళకు ఏటా రూ.18750 చొప్పున నాలుగేళ్లుగా రూ.75000 నగదును వారి ఖాతాల్లో జమచేశారు. గురువారం నాల్గవ విడుత వైఎస్సార్ చేయూత నిధులను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనకాపల్లి నుంచి బటన్ నొక్కి మహిళల ఖాతాలో జమ చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలలో 15553 మందికి రూ.29.16 కోట్లు, ఆదోని నియోజకవర్గంలోని ఆదోని, ఆదోని అర్బన్ ఏరియా పరిధిలో 16340 మందికి రూ.30.64 కోట్లు విడుదల చేశారు. ఆదోని నియోజకవర్గంలో నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత పథకం కింద 16340 మందికి రూ.116.30 కోట్లు, మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగు విడుతల్లో 15553 మందికి రూ.105.12కోట్లు నగదును మహిళ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. చేయూత పథకం కింద లబ్ధి పొందిన మహిళలు చిరు వ్యాపారాలు, కుట్టు మిషన్లు, కిరాణ, జనరల్ దుకాణాలు, పిండి మర, గొర్రెలు, ఆవులు, మేకలు పెంపకం, బట్టల దుకాణాలు తదితర వ్యాపారాలు సాగిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇచ్చిన మాటకు ప్రకారం మహిళలకు చేయూతనందించిన సీఎం జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగేళ్లలో చేయూత పథకం కింద అందించిన లబ్ధి వివరాలు

	మంత్రాలయం నియోజకవర్గంలో..		ఆదోని నియోజకవర్గంలో..	
విడత	లబ్ధిదారులు	నగదు(రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నగదు(రూ.కోట్లలో)
మొదటి	13,372	25.07	14160	26.55
రెండవ	14163	26.56	15747	28.78
మూడవ	15110	28.77	16126	30.24
నాల్గవ	15553	29.16	16340	30.64
	రూ. 105.12 కోట్లు		రూ.116.30 కోట్లు	

ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో చేయూత నాల్గవ విడత లబ్ధి వివరాలు

మండలం	మహిళలు	నగదు (రూ.కోట్లలో)
కోసిగి	4030	7.56
కౌతాళం	4518	8.47
మంత్రాలయం	3606	6.76
పెద్దకడబూరు	3359	6.37
మొత్తం	13553	రూ.29.16 కోట్లు
ఆదోని	6636	12.41
ఆదోని అర్బన్	9724	18.23
మొత్తం	16340	రూ.30.64 కోట్లు

పిండి మర పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం

సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18750 చొప్పున నాలుగేళ్లుగా అందిస్తున్నారు. వచ్చిన నగదుతో ఇంటి వద్ద పిండి మర ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణ సాగిస్తున్నాం. అలాగే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ ద్వారా లబ్ధి పొందుతున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– హలిమాబీ, కోసిగి

జనరల్ దుకాణం పెట్టుకున్నాం

మాది కందుకూరు గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాకు ఎంతో లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకం కింద వచ్చిన నగదుతో ఇంటి వద్ద జనరల్ స్టోర్ పెట్టుకున్నాను. రోజువారీ ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాను. సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో మా కుటుంబం ఆనందంగా ఉన్నాం.

– హనుమంతమ్మ, కందుకూరు

మహిళలకు చైతన్యం కల్పిస్తున్నాం



పొదుపు సంఘంలో చేరిన ప్రతి మహిళకు ఆర్థికంగా ఎలా ఎదగాలనే అంశాలపై చైతన్యం కల్పిస్తున్నాం. బ్యాంక్ లింకేజీ, ఆసరా, వైఎస్సార్ చేయూత కింద లబ్ధి పొందిన మహిళలు నగదు వృథా చేయకుండా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నాం.

– సత్యమ్మ, ఏపీఎం

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన నిరుపేదలకు జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వాల్మీకినగర్‌లో 300 మంది నిరుపేదలకు యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత చేతులమీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు స్థలాలపై సంపూర్ణ హక్కులు లభించేలా రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం వైఎస్సార్ సీపీకే సాధ్యమైందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వార్డు ఇన్‌చార్జ్ సుధాకర్, పార్టీ కార్యకర్తలు బాబు, పూలతోట రాముడు, మల్లి, మధు, రామకృష్ణ, యువరాజ్, రామంజి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోనిరూరల్: మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ సూచించారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మహిళల చట్టాల గురించి తెలియజేశారు. మహిళలు చైతన్యవంతులు కావాలని, అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళా న్యాయవాది సావిత్రి, వన్‌టౌన్ సీఐ తేజమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కక్షలు మాని ప్రశాంతంగా జీవించండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

మంత్రాలయం: గ్రామాల్లో కక్షలు మానుకుని ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ కృష్ణమూర్తి సూచించారు. గురువారం మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కక్షలు మనుసులో పెట్టుకుని గొడవలకు పాల్పడితే కుటుంబాలు నాశనం అవుతాయి తప్పా, ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రానున్న ఎన్నికలను దృష్టి ఉంచుకుని ప్రత్యేక నిఘా ఉంచామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు శాంత మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణం ఈశాన్య భాగంలోని నవరత్నగిరిపై వెలసిన శాంతమల్లేశ్వర స్వామికి మాఘ మాసం సందర్భంగా నెలరోజులుగా వివిధ ద్రవ్యములచే, గంగా జలాలచే రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు చిన్మయమిషన్ సంస్థ ఇన్‌చార్జి బ్రహ్మచారి నారాయణ చైతన్య, సుజాతమ్మ, రమేష్, రఘునాథ్, జగదీశ్, కేశవయ్య తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా సూర్యోదయానికి ముందు మహన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధాన దేవాలయ ప్రాంగణంలో ఉన్న ఉప ఆలయాల్లోని శివ లింగాలకు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోనిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం శుభదాయకమని మహిళా అడ్వకేట్, సంగీత కళాకారిణి దేశాయి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆదోని-ఆలూరు రహదారిలోని బీమా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చదువుతోనే విద్యార్థినులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ మనువిద్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

- వీధి కుక్కలను నియంత్రించాలి
- మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యుల డిమాండ్

నీటి సమస్య పరిష్కరించండి



కౌన్సిల్‌లో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్న పాలకవర్గ సభ్యులు

ఆదోనిటౌన్: ఎండాకాలం వచ్చింది. పట్టణంలోని శివారు ప్రాంతాలు, వాడల్లో నీటి సమస్య జఠిలమవుతోంది. యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు బాలాజీ, ఇస్మాయిల్, రఘునాథ్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, పార్వతి మాట్లాడారు. పట్టణంలో నాలుగైదు రోజుల కొకసారి నీటిని వదులుతున్నారని, తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నీటి సరఫరాలో వేళలను మార్చాలని కౌన్సిలర్లు బాలాజీ, రఘునాథ్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో ప్రతి వీధిలోనూ వీధికుక్కల బెడద నానాటికీ తీవ్రతరమవుతున్నదని, వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. నాలుగు రోజుల క్రితం వెంకన్నపేటలో నాలుగేళ్ల బాలుడు కేదార్‌నాథ్ కుక్కల దాడిలో గాయపడి మృతిచెందినట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. 9 ఆటో రిక్షాలు మున్సిపల్ కార్యాలయం ముందు వృథాగా పడి ఉన్నాయని, ప్రజాధనం దుర్వినియోగం గాకుండా వాటిని వినియోగంలోకి తేవాలని కౌన్సిలర్లు బాలాజీ, రఘునాథ్‌రెడ్డి కోరారు. 2022 మార్చి 31వ తేదీన రూ.40 లక్షలు వెచ్చించి 135 వాకీటాకీలు కొనుగోలు చేశారని, రెండేళ్లు కూడా గడవకముందే అవి కనబడకుండా పోయాయని బాలాజీ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని సభ్యులు ఆరోపించారు. ఆయా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి భరోసానిచ్చారు. సమావేశంలో శానిటేషన్, ఇంజనీరింగ్, టీపీఓ, రెవెన్యూ సెక్షన్ల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమ్మానాన్నకు ప్రేమతో తరంగ్



సందేశాత్మక పాటలకు నృత్యం చేస్తున్న బాల బాలికలు

ఆదోనిఅర్బన్: అమ్మా, నాన్నకు ప్రేమతో కిడ్డీస్ తరంగ్–2024 కార్యక్రమం స్థానిక రెడ్డీస్ హాస్టల్‌లో గురువారం జరిగింది. కిడ్డీస్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల డైరెక్టర్ల ఆధ్వర్యంలో చిన్నారులు, బాలబాలికలు సందేశాత్మకమైన సినీ పాటలకు నృత్యంతో అలరించారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాసులు పాల్గొని తల్లిదండ్రుల ప్రేమ గురించి గీతాలు ఆలపించారు. తల్లిదండ్రుల ప్రేమ మరువరాదని, తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు తోడుగా ఉండాలన్నారు. గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినుల తల్లిదండ్రులను సన్మానించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఆలూరు: బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం ఆదేశించారు. చిప్పగిరి గ్రామం నుంచి దౌల్తాపురం, మద్దికెర వరకు రూ.10 కోట్లతో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలూరు నియోజకవర్గంలో ఏపీ సీఆర్ఎఫ్ గ్రాంటు కింద ఏపీ ఎంఐపీ కింద 24 రోడ్ల పనులకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.75 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయన్నారు. దాదాపు అన్ని రోడ్లు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఆలూరు పీఐయూ డీఈ భాస్కర్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



డి.బెళగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోసిగి: మండలంలోని డి.బెళగల్, కోసిగిలో 15వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఐసీడీఎస్, రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డిఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం డి.బెళగల్ గ్రామ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలతో కలిసి గ్రామ సర్పంచ్ పద్మమ్మ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మహిళలతో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహిళలకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయని, రిలయన్స్ ఫౌండేషన్ భీమేష్ ఆధ్వర్యంలో మహిళా సర్పంచ్ పద్మమ్మకు శాలువా, పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఆటలపోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంత మహిళలు చైతన్య వంతులుగా ఎదగాలని సూచించారు. అలాగే కోసిగిలో 15వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాలయంలో ఉద్యోగ మేళా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం: మండలకేంద్రంలోని రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో గురువారం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలు కంపెనీలు పేటీఎం, అమరరాజ గ్రూప్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీ తదితర కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ/వార్డు సచివాలయాల్లో లక్షలాది మందికి నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగఅవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ద్వారా యువతకు గుర్తింపు పొందిన కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఐ గోపినాథ్, పార్టీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి, సర్పంచ్ తెలబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



నాడు - డంబలదిన్నెలోని బీసీ కాలనీ రోడ్డు



నేడు - కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



నాడు - మెయిన్ రోడ్డు నుంచి ఆచారి ఇంటి వరకు దారి



నేడు - కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు

డంబలదిన్నెకు మహర్దశ

కౌతాళం: గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యలకు వైఎస్సార్‌సీపీ పాలనలో పరిష్కారం దొరికింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయడంతో గ్రామాలు అభివృద్ధి వైపు పయనించాయి. ప్రతి పంచాయతీకి రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులతో అభివృద్ధి ఊపందుకుంది. మండల పరిధిలోని బాపురం సచివాలయ పరిధిలోని డంబలదిన్నె గ్రామంలో ప్రధాన రోడ్లన్ని సిమెంటు రోడ్లుగా మారిపోయాయి. గ్రామంలో దశాబ్దల కాలం నుంచి ఉన్న సమస్యలను గడప గడప మన ప్రభుత్వం నిధులతో పరిష్కరించి, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడప గడప నిధులు రూ.15లక్షలతో గ్రామంలోని మూడు రోడ్లను పూర్తి చేసినట్లు బాపురం గ్రామ సర్పంచ్ శిల్ప, గ్రామ ఇన్‌చార్జి గురునాథ్‌రెడ్డి తెలిపారు.

పంచాయతీ ఆదాయం పెంపునకు కృషి

హొళగుంద: గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ ఆదాయం పెంపునకు సర్పంచ్, వైస్ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు కృషి చేయాలని హెబ్బటం ఇన్‌చార్జ్ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు. గురువారం హెబ్బటం పంచాయతీ కార్యలయంలో సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల వ్యవస్థ ఇతర అన్నింటిపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. పంచాయతీకి ఆదాయ వనరులైన పన్నుల వసూలు, ఇతర వాటిపై దృష్టి సారించి తద్వారా వచ్చే నిధులను అభివృద్ధి పనులకు వాడుకుంటామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలని వార్డు సభ్యులను కోరారు. వైస్ సర్పంచ్ సవారప్ప, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు నరసప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మేజర్ పంచాయతీ వేలాలలో గతేడాది కంటే రూ.9 లక్షల ఆదాయం పెరిగింది. మొత్తంగా రూ.36,91,900 ఆదాయం లభించింది. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముత్యాలశైలజ, ఇన్‌చార్జ్ ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలాలలో ముఖ్యంగా పార్కింగ్ ఫీజు హక్కులకు వేలందారులు పోటీ పడ్డారు. గతేడాది కంటే ఏకంగా రూ.9,70,000లకు (గతేడాది రూ.6 లక్షలు) అధికంగా అనగా రూ.15,70,000లకు బాలు దక్కించుకున్నాడు. మిగతా వాటిలో దినసరి కూరగాయాల మార్కెట్ రూ.90 వేలు తగ్గింది. మొత్తంగా వారపు సంత మార్కెట్ రూ.3,07,000 లకు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.2,52,000 లకు, జంతు వధ శాల రూ.1,26,000లకు, ఆర్కే రోడ్డులోని 8 రూములు రూ.10,84,000లకు, సంతమార్కెట్ రూములు రూ.3,30,000లకు, మాంసపు అంగళ్లు రూ.21,600లకు వ్యాపారులు దక్కించుకున్నారు. జెడ్పీటీసీ సుంకన్న, ఎంపీటీసీ రవిరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరు

మద్దికెర: మండల కేంద్రంలోని ప్రధాన బజారులో కాయగూరల మార్కెట్‌ను నిర్మించేందుకు నాబార్డు నిధులు రూ.18.50 లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో మార్కెట్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.రూ.3.50 లక్షలు కంట్రిబ్యూషన్ కింద స్థానికులు అర్ధేగేరి రామకృష్ణారెడ్డి కుటుంబీకులు చెల్లించగా ప్రభుత్వం రూ.15లక్షలు మంజూరు చేసిందన్నారు.